VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 09 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 348




2లో

**ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు**


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# యుద్ధప్రాతిపదికన స్కిల్ యూనివర్సిటీ

- అసెంబ్లీ సమావేశాలకు ముందే ఏర్పాటు
- ఐఎస్‌బి తరహాలో బోర్డు ఏర్పాటుకు చర్యలు
- విద్యారంగ, పారిశ్రామిక ప్రముఖులలకు సూచన
- ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ సందర్శించిన సిఎం రేవంత్

హైదరాబాద్: రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరగాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాలకు ముందే జులై 23 లోపు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని పరిశ్రమల శాఖ, విద్యా శాఖ అధికారులతో పాటు పారిశ్రామిక రంగ ప్రముఖులకు సీఎం సూచించారు. వాటిని పరిశీలించి ఇరవై నాలుగు గంటల్లో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రముఖులతో ముఖ్యమంత్రి సోమవారం మధ్యాహ్నం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో స్కిల్ డెవెలప్మెంట్ పై సమావేశ మయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతో పాటు ప్రముఖుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అటు ఐటీ కంపెనీలతో పాటు ఇటు పరిశ్రమలన్నింటికీ అందుబాటులో ఉన్నందున ఈ సిటీ ప్రాంగణంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఐ.ఎస్.బీ తరహాలో ఒక బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చర్చ జరిగింది. అప్పటివరకు ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. స్కిల్ యూనివర్సిటీలో ఏమేం కోర్సులుండాలి, ఎలాంటి పాఠ్యాంశాలు ఉండాలి.. పరిశ్రమల అవసరాలు తెలుసుకొని, వాటికి అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు ఉండేందుకు ఏయే నైపుణ్యాలపై కోర్సులు నిర్వహించాలనేది ముందుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. అధునాతన పరిజ్ఞానం అందించేలా ఈ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించాలని చెప్పారు.

÷ర్ణీత గడువు పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని, కేవలం 15 రోజుల వ్యవధి ఉన్నందున ప్రతీ అయిదు రోజులకోసారి సమావేశం కావాలని సీఎం వారికి దిశా నిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా.. ప్రభుత్వమే ఈ బాధ్యతలను చేపట్టాలా... మరేదైనా విధానం అనుసరించాలా.. అనేది కూడా పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

÷ఔనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణులైన ఒక కన్‌స్టలెంట్ ను నియమించుకోవాలని సీఎం చెప్పారు. యూనివర్సిటీ వ్యవహారాలకు పరిశ్రమల శాఖ నోడల్ డిపార్టుమెంట్ గా వ్యవహరిస్తుందన్నారు. ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ

జయేష్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, ఇన్వెస్ట్ మెంట్స్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణు వర్ధన్ రెడ్డి, డాక్టర్ రెడ్డిస్ ల్యాబ్ ఛైర్మన్ సతీష్ రెడ్డి,

భారత్ బయోటెక్ హరి ప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి,

ఐ ల్యాబ్స్ శ్రీనిరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మావేశానికి ముందు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ ను ముఖ్యమంత్రి

పరిశీలించారు.

దాదాపు ఇరవై నిమిషాల పాటు కలియ తిరిగి అందులో ఉండే సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే కాలేజీ సిబ్బందితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.




## హైవేపై నిత్యకృత్యంగా ప్రమాదాలు


**కర్నూలు:** కర్నూలు హైవే మృత్యుమార్గమైంది. తరచూ హైవే ప్రమాదాలు జిల్లాలో మామూలయ్యాయి. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో అధికారులు పట్టించుకోవడం లేదు. హైవేపై వేగం నియంత్రణ నిబంధనలు పాటించక పోవడమే దీనికి కారణం. దీంతో భద్రత లేమి స్పష్టంగా కనిపిస్తోంది. అంతులేని వేగంతో వాహనాలు దూసుకెళ్లి రోడ్డు పైన నెత్తురు చిందుతున్నాయి. రహదారి నిబంధనలేవీ అమలు కావడం లేదు. ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తరచూ ఎక్కడో ఒక చోట ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఘటన జరిగినప్పుడు తప్ప మళ్లీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. వెల్దుర్తి, డోన్, ప్యాపిలి ప్రాంతాల్లోని హైవేలో ఉన్న రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లుగా మారిపోయాయి. జిల్లాలో 85 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్–44 ఉంది. కర్నూలు నుంచి వెల్దుర్తి, డోన్, ప్యాపిలి మీదుగా పోదొడ్డి వరకు జిల్లా హైవే రహదారి ఉంది. ఈ ప్రాంతాల్లోని రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లయ్యాయి. డోన్ పరిధిలో ఆరు హైవే కూడళ్లు ప్రమాదాల నిలయాలయ్యాయి. హైవేపై అతివేగంగా వాహనాలు దూసుకొస్తున్నాయి. నిబంధనల ప్రకారం హైవేపై వాహనాల వేగం 80 కిలోమీటర్లు మించరాదు.

## కర్ణీంనగర్ జిల్లా పోలీసులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ**

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బకాయిలను చెల్లించిన ప్రభుత్వం కరీంనగర్ జిల్లా పోలీసులను పట్టించుకోకపోవడం బాధాకరమని మంత్రి అన్నారు. గురుకుల విద్యాలయాలకు రూపొందించిన కొత్త టైం టేబుల్ పనివేళలను కుదించాలని లేఖలో పేర్కొన్నారు. ఉదయం 5 నుండి రాత్రి 9.30 గంటల వరకు పనివేళలు రూపొందించడంవల్ల నిద్రలేమి, మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని వెల్లడించారు. రాత్రిపూట స్టడీ అవర్, కేర్ టేకర్ విధులను కూడా టీచర్లకు అప్పగించడం సరికాదన్నారు. వార్డెన్ల పోస్టులు మంజూరైనా భర్తీ చేయకపోవడం బాధాకరం అన్నారు. తక్షణమే వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా పోలీసులకు నెలల తరబడి టీఏ, డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్ బిల్స్ చెల్లించకపోవడం దారుణమని తెలిపారు. వివిధ విభాగాల్లోని దాదాపు వెయ్యి మంది పోలీసులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బకాయిలను చెల్లించిన ప్రభుత్వం కరీంనగర్ జిల్లా పోలీసులను పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. తక్షణమే టీఏ, డీఏ, పీఆర్సీ బకాయిలతోపాటు సరెండ్ లీవ్ బిల్స్ చెల్లించాలని లేఖలో తెలిపారు.



## షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ పరీక్షలు

**స్పష్టం చేసిన తెలంగాణ విద్యాశాఖ**

**హైదరాబాద్:** తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుత నోటిఫికేషన్‌ను రద్దు చేసి మరిన్ని పోస్టులను జత చేసిన మెగా డీఎస్సీ నిర్వహించాలన్న డిమాండ్‌తో అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు. ఈ రోజు కూడా పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ముందు అభ్యర్థులు ఆందోళన చేశారు. ఈ ఆందోళనను పట్టించుకోకుండా ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11 నుండి వెబ్ సైట్‌లో హాల్ టికెట్స్ అందుబాటులో ఉండనున్నాయి. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్స్ ఉండనున్నాయి. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 5 వరకు డీఎస్సీ జరగనున్నాయి.

## పీర్జాదిగూడ నిర్మాణాల కూల్చివేత అక్రమం



**హైదరాబాద్:** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 1లో ఉన్న భారీ నిర్మాణాలను సోమవారం ఉదయం అధికారులు కూల్చివేసిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీ కాంగ్రెస్ నాయకులు అమ్మిన, మీ కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసిన ప్లాట్లలో నిర్మించుకుంటున్న ప్రజల ఇండ్లను మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏమి ఆశించి ఈరోజు కూలగొట్టించాడో ఒకసారి విచారణ చేయించండి. ప్రజా పాలనలో ప్రజలకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో నిర్బంధిస్తారా..? మీకు అన్నగా ప్రచారం చేసుకుంటూ సుధీర్ రెడ్డి మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో చేస్తున్న అరాచకాలపై మీరు ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోండి. లేదంటే ప్రజలు తిరగబడుతారు. మీ నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని నిలువరించలేవు.అని కేటీఆర్ తేల్చిచెప్పారు. అమాయక ప్రజలకు ఈ ప్లాట్లు అమ్మింది కాంగ్రెస్ నాయకుడు రాందాస్ గౌడ్, మరో కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ అమర్ సింగ్ కుటుంబం. ఈ ప్లాట్లను 2008లో నాట

సీఎం రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. గతంలో రెవెన్యూ అధికారులు

ఇది పట్టా భూమిగా ఎన్‌వోసీ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మున్సిపల్ అధికారుల అనుమతి

తీసుకొని చాలా మంది ప్రజలు

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు.

## కొత్త పింఛన్లకు అర్హుల జాబితా సిద్ధం చేయాలి



హైదరాబాద్: తెలంగాణలో కొత్త సామాజిక పింఛన్ల మంజూరు కోసం అర్హుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగులో ఉన్నవి, తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అందిన దరఖాస్తుల ఆధారంగా నివేదిక ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చినట్లు చేయూత పథకం కింద పింఛన్ల మొత్తాన్ని ప్రభుత్వం పెంచనుందన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) కార్యకలాపాలపై సచివాలయంలో మంత్రి సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి లోకేశ్‌కుమార్,

సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "వివిధ పథకాలకు గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లను ఇవ్వకపోవడం వల్ల కేంద్రం నిధులను సరిగా వాడుకోలేకపోయాం. మా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. అభయ హస్తం వంటి పథకాలను అమలు చేయకుండా రూ.వందల కోట్ల మహిళల పొదుపు సొమ్మును గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది.

## హిమాచల్‌లో వర్షాలకు జనజీవన అస్తవ్యస్థం

**76 రహదారులను మూసివేసిన అధికారులు**

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లో కొన్ని రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. పలుచోట్ల భారీ వర్షాల నేపథ్యంలో 76 రహదారులను మూసివేశారు. వీటిలో 52 రహదారులు మండీలో ఉండగా.. 13 సిర్‌మౌర్, 6 శిమ్లాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, శిమ్లా, కంగ్రా, చంబా జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. భారీ వర్షాల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో పలు ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించింది. రాష్ట్రంలో పలు చోట్ల జులై 10, 11 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా

వేసిన భారత వాతావరణ శాఖ జులై 13వరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గడిచిన 24గంటల్లో శిమ్లాలోని రాంపుర్ బుషార్ 33 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా.. సర్హన్ జిల్లాలో 11 ఎం.ఎం, వంగ్టూ (కిన్నౌర్) 8 ఎం.ఎం చొప్పున నమోదైంది. మరోవైపు, ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వానలతో నదులు ఉప్పొంగుతున్నాయి. ప్రమాదకర పరిస్థితులు తలెత్తితే.. సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని కేంద్రం ఇప్పటికే రాష్ట్ర అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది.




# నేటినుంచి సీఎం రేవంత్ జిల్లాల పర్యటన

**హైదరాబాద్** :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. జిల్లా కలెక్టరేట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా ప్రముఖులతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరనున్నారు. మ. 12.45 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటారు. మ. 12.45 నుంచి ఒంటి గంట వరకు కలెక్టరేట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఉమ్మడి జిల్లా ప్రముఖులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధిపై సమీక్షా నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 5.45 వరకు భూత్పూర్ రోడ్డులోని ఏఎస్‌ఎన్ కన్వెన్షన్ హాల్‌లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

కీవ్:: ఉక్రెయిన్ పై రష్యా భీకర దాడులతో విరుచుకుపడుతోంది. కీవ్ సహా ఆ దేశవ్యాప్తంగా పలు నగరాలపై పెద్ద ఎత్తున క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో 20 మంది వరకు మృతిచెందారు. 50 మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. కీవ్‌లో ఉన్న హాస్పిటల్ ఓఖ్‌మాత్‌డిత్.. ఇది దేశంలోని అతిపెద్ద చిన్నారుల ఆసుపత్రి. దీనిపైనా కూడా రష్యా దాడులు చేసింది. నాలుగు నెలల వ్యవధిలో రాజధానిపై జరిగిన దాడులలో ఇదే అతిపెద్దది. పేలుళ్ల ధాటికి స్థానికంగా ఉన్న భవనాలు దద్దరిల్లాయి. కీవ్ నగరంలో ఏడుగురు మృతిచెందారు. క్రీవిరీహ్ లో 10 మంది మృతిచెందగా, దొనెట్స్క్‌లోని పోక్రోవ్స్క్‌లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అత్యాధునిక కింజాల్ రాకెట్లను రష్యా ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన ఆరోపిస్తోంది. 40కి పైగా క్షిపణులతో తమ దేశంలోని ఐదు నగరాలను మాస్కో లక్ష్యంగా చేసుకున్నదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించాడు. పిల్లల ఆసుపత్రి భవనం పాక్షికంగా ధ్వంసమైందని, శిథాలల కింద చిక్కుకుపోయినవారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ వ్యవహారంపై ప్రపంచ దేశాలు మౌనంగా ఉండకూడదన్నారు. రష్యా ఏం చేస్తుందో అందరూ గమనించాలంటూ సోషల్ మీడియా ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే, అమెరికాలో నాటో శిఖరాగ్ర సమావేశాల సమయంలో ఈ దాడులు చేసుకోవడం గమనార్హం.

## నీట్ పేపర్ లీక్ ఎంతమందికి చేరింది

న్యూఢిలీ: దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్ యూజీ 2024 పరీక్ష అక్రమాల వ్యవహారంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షలో పేపర్ లీకైన మాట వాస్తవమేనని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఎక్కడ ఎలా లీకైందీ, ఎంతమందికి చేరిందన్నది కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు. లీకైన ప్రశ్నపత్రం సోషల్‌మీడియాలో వ్యాప్తి చేశారని తెలిసినా మళ్లీ పరీక్ష నిర్వహించాలని చెబుతాం. కానీ, రీ–టెస్ట్‌కు ఆదేశించే ముందు.. లీకైన పేపర్ ఎంతమందికి చేరిందో తేలాల్సి ఉందని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఇది 23లక్షల మందితో జీవితాలతో ముడిపడిన అంశం అయినందున.. 'నీట్ రీటెస్ట్'ను తాము చివరి అవకాశంగా పరిగణిస్తామని వెల్లడించింది. నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకైందని, అవకతవకలు, అక్రమాలు జరిగాయని, పరీక్షను రద్దు చేయాలని సుప్రీం కోర్టులో మొత్తం 38 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. నీట్ ప్రశ్నపత్రం లీకైంది అన్న విషయం స్పష్టమైంది. పరీక్ష పవిత్రతను దెబ్బతీశారని రుజువైనా లేదా నేరం చేసిన వారిని గుర్తించలేకపోయినా మేం నీట్ రీ–టెస్ట్‌కు ఆదేశిస్తాం. ఈ సందర్భంగా కేంద్రానికి న్యాయస్థానం కీలక ప్రశ్నలు సంధించింది. పేపర్ లీక్ తో ఇద్దరు విద్యార్థులకే సంబంధం ఉందని అంటున్నారు.. కానీ, అది 23లక్షల మంది జీవితాలతో ముడిపడిన అంశం. అందువల్ల, లీక్ ఎలా జరిగింది అనేది తెలుసుకోవాలి. లీకైన పేపర్ ఎంతమందికి చేరిందో గుర్తించారా? ఎలా చేరిందో తెలుసుకున్నారా?లీకేజీతో లబ్ధిపొందిన విద్యార్థులపై ఏం చర్యలు తీసుకున్నారు?ఎంతమంది విద్యార్థుల ఫలితాలను హోల్డ్‌లో ఉంచారు?వీటికి సమాధానాలు కావాలి. వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు జరగాలని ధర్మాసనం ఆదేశించింది. అన్నీ పరిశీలించిన తర్వాత దీనిపై తీర్పు చెబుతామని వెల్లడించింది. నీట్ వ్యవహారంపై దర్యాప్తు ఎక్కడిదాకా వచ్చిందో తెలుపుతూ తమకు నివేదిక సమర్పించాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. ప్రశ్నపత్రం తొలిసారి ఎప్పుడు లీకైందన్న విషయాన్ని వెల్లడించాలని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి సూచించింది. ఈ ఏడాది మే 5వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2024 పరీక్ష నిర్వహించారు. అయితే పరీక్ష పేపర్ లీక్ అవడంతో పాటు పరీక్ష నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు వార్తలు రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఫలితాల్లో ఏకంగా 67 మందికి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు రావడంపైనా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే సుప్రీం ఆదేశాల మేరకు ఇటీవల గ్రేస్ మార్కులు కలిపిన 1563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించి సవరించిన నీట్ ర్యాంకుల జాబితాను ఎన్‌టీఏ విడుదల చేసింది. తాజా పరిణామాలతో అటు కౌన్సెలింగ్‌ను కూడా వాయిదా వేసింది.

## బిఆర్ఎస్‌కు మరో షాక్

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. అలాగే ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా ఒకేసారి 'కారు' దిగేశారు. దీంతో పార్టీ నుంచి వెళ్లిపోయేవారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూనే ఉంది. అటు కాంగ్రెస్‌లో చేరికలు పెద్ద ఎత్తున కొనసాగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉండగా తాజాగా మరో ఎమ్మెల్సీ బీఆర్ఎస్‌ను వీడటానికి సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్సీ చల్లా భేటీ అయ్యారు. అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సాగు నీరు అందించే నె÷–టటెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయాలని సీఎంను ఎమ్మెల్సీ కోరారు. ఈ రోజు లేదా రేపు కాంగ్రెస్‌లో చల్లా చేరే అవకాశం ఉంది. అయితే ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటం తో ఏమీ చేయలేని స్థితిలో గులాబీ పార్టీ ఉండిపోయింది.

## పీర్జాదిగూడ కూల్చివేతలు దారుణం

**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డబ్బులు దండుకోవటం తప్ప పాలనపై ధ్యాస లేదని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ పరిధిలోని ప్రియ ఎన్ క్లేవ్‌లో పేదల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిందంటూ ఈటెల తీవ్రంగా స్పందించారు. అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నా కూల్చివేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇలాంటి నియంతృత్వ పోకడలకు పోయే ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రెవెన్యూ మంత్రికి తెలియకుండానే అధికారులు ఇళ్లు కూల్చివేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ప్రియ ఎన్ క్లేవ్‌లో ఇళ్లు నిర్మించుకున్న వారంతా చిన్నచిన్న ఉద్యోగులు, చిరువ్యాపారులు, పేదలే అని ఈటెల తెలిపారు. ఒకవేళ ఇవి అక్రమ భూములే అయితే జీహెచ్ఎంసీ అధికారులు గతంలో ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. దీని వెనక రాజకీయకుట్ర దాగి ఉందని ఈటెల ఆరోపించారు. ఇళ్లు నిర్మించుకున్న స్థలం ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన రామ్ దాస్ గౌడ్ నుంచే బాధితులంతా కొనుగోలు చేశారని, పోచయ్య అనే కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరకపోవడంతోనే వివాదానికి తెరతీశారని ఆరోపించారు. భయపెట్టి పార్టీలో చేర్చుకోవడం లేదంటే కేసులు పెట్టి జైళ్లకు పంపాలని చూసిన గత బీఆర్ఎస్ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో గుర్తు చేసుకోవాలన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షసూచన

### తెలంగాణజిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



**హైదరాబాద్:** వర్షాకాలం వచ్చి నెల దాటినా తెలుగు రాష్ట్రాలు ఇప్పటి వరకు సరైన వర్షాలు లేవు. పైగా ఉక్కపోత కొనసాగుతోంది. అడపాదడపా వర్షాలు పడుతున్నా... భూగర్భజలాలు కూడా పైకి రాలేదు. దీంతో... ఇంకా వేసవికాలం కొనసాగుతూనే ఉందా..? అని అనిపిస్తోంది. హైదరాబాద్‌లో ఇంకా వాటర్ ట్యాంకర్లు తిరుగుతూనే ఉన్నాయి. సరైన వర్షాలు పడి ఉంటే... ఇప్పటికే భూగర్భజలాలు మెండుగా ఉండేవి. కానీ... ఈఏడు ఆ పరిస్థితిలేదు. దీంతో... వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో చల్లటి వాన కబురు చెప్తోంది భారత వాతావరణ శాఖ. తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు వర్షాలు దంచికొడతాయని అంచనా వేస్తోంది. అంతేకాదు... తెలంగాణలో అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ కూడా జారీ చేసింది. ఈ వర్షాలతో అయినా ఉక్కపోత పోయి... వర్షాకాలం వచ్చిందే ఫీలింగ్ వస్తుందేమో చూడాలి. శ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా ఉపరిత ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ లో వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు వాతావరణ శాఖ అధికారులు. ఏపీలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్తున్నారు. అలాగే... రాయలసీమతోపాటు మరికొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని కూడా తెలిపారు. విశాఖ, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షం కరవొచ్చని అంచనా వేస్తున్నారు. వర్షం పడే సమయంలో... గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణ, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది వాతావరణ శాఖ. తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు ఐఎండీ ప్రకటించింది. హైదరాబాద్‌లో కూడ కుండపోత వర్షం కురుస్తుందని తెలిపింది. ఐదు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని... వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాలోకు రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇక.. సాయంత్రం 4గంటల తర్వాత హైదరాబాద్‌లో భారీ వర్షం కురుస్తుందని అంచనా వేస్తున్నారు. వర్షం కురిసే సమయంలో గాలుల వేగం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే... నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లో కూడా వర్షాలు కురుస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే పలు చోట్ల వర్షాలు పడుతున్నాయి. అయితే... పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా కొనసాగుతున్న ఉపరిత ఆవర్తనం ప్రభావంతో... మూడు నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నాయి. మరోవైపు.. కేరళ నుంచి గుజరాత్ తీరం వెంబడి ద్రోణి వస్తరించి ఉంది. దీని కారణంగా... అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయి. దీంతో... దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడతాయని అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... 11 రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన ఉంది. ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. భారీ వర్షాలు, వరదలతో... ఉత్తరాఖండ్ జలవిలయంగా మారింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. కొండచరియలు విరిగి పడి... రహదారులు మూతపడ్డాయి. వర్షాల కారణంగా ఇప్పటికే చార్‌ధామ్ యాత్ర కూడా ఆపేశారు. ఉత్తరాఖండ్‌తోపాటు... యూపీ, బిహార్, అసోంలో కూడా వర్షాలు పడుతున్నాయి. వీటితోపాటు... ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోనూ వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది.



## అనర్హత వేటుపై కోర్టును ఆశ్రయించిన జంగా

ఎమ్మెల్సీ ఖాళీగా ఉందంటూ నోటిఫై చేయరాదని ఆదేశం

**అమరావతి:** ఎమ్మెల్సీగా అనర్హత వేటు వేయడంపై జంగా కృష్ణమూర్తి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎమ్మెల్సీ స్థానం ఖాళీగా ఉన్నట్లు నోటిఫై చేయొద్దని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. జంగా కృష్ణమూర్తి పిటిషన్‌పై విచారణను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. కేసుకు సంబంధించి పూర్తి వివరాలను సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది.

# వికసిత్ భారత్‌కు ప్రజల ఓటు

### దేశాభివృద్ధి కోసమే మోడీ ఆలోచన


### బిజెపి కార్యవర్గ సమావేశాల్లో పురంధేశ్వరి



**రాజమహేంద్రవరం:** వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రజలు ఓటు వేశారని భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన భాజపా రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్డీయే కూటమి విధానాలకు అనుకూలంగా ప్రజలు ఓటు వేశారన్నారు. ఐదో ఆర్థికశక్తిగా భారత్ ఎదగడం వల్లే అభివృద్ధి సాధ్యమైందని చెప్పారు. దేశాభివృద్ధి కోసమే ప్రధాని నరేంద్ర మోదీ ఎల్లప్పుడూ ఆలోచిస్తారని కేంద్ర మంత్రి మురుగన్ అన్నారు. మూడోసారి బాధ్యతలు చేపట్టాక పేదలకు 3 కోట్ల ఇళ్ల పథకంపై ప్రధాని మోదీ మొదటి సంతకం చేశారని చెప్పారు. రైతుల ఖాతాలకు రూ.20 వేల కోట్లను జమచేస్తూ రెండో సంతకం చేశారని గుర్తు చేశారు. పదేళ్ల ఎన్డీయే పాలనలో దేశం అద్భుత ప్రగతి సాధించిందని తెలిపారు. వైసీపీ పాలన ఏపీలో ఎమర్జెన్సీని తలపించిందని పురందేశ్వరి వ్యాఖ్యలు చేశారు. జగన్ పాలనలో హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. జగన్ ఎంత నొక్కేసారో ప్రజలు గమనించి ఎన్నికల్లో ఓడించారని తెలిపారు. బాధ్యతతో మెలుగుతూ ఏపీ అభివృద్ధికి సహకరిద్దామని ఎంపీ పురందేశ్వరి వెల్లడించారు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదిగిందన్నారు. 2019లో బీజేపీకి 23 కోట్ల ఓట్లు వచ్చాయని.. 2024 ఎన్నికల్లో 24 కోట్ల ఓట్లు వచ్చాయని తెలిపారు. బీజేపీకి గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓట్ల సంఖ్య పెరిగిందన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారం వల్ల ఎంపీ సీట్ల సంఖ్య కొంచెం తగ్గిందన్నారు. కాంగ్రెస్ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిందన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి ఏపీకి సుపరిపాలన అందిస్తుందని ప్రజలు అధికారం ఇచ్చారని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.రాజమండ్రిలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, కేంద్ర మంత్రులు మురుగన్, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్య కుమార్, ఎంపీలు సీఎం రమేష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కామినేని శ్రీనివాస్, ఆదినారాయణ రెడ్డి, విష్ణుకుమార్ రాజు, సుజనాచౌదరి, ఈశ్వరరావు, పార్థసారధిహాజరయ్యారు.

# జగన్ అక్రమాస్తుల కేసులో నిమ్మగడ్డ ప్రసాద్‌కు చుక్కెదురు


### జగన్ అక్రమాస్తుల కేసులో పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది.



**హైదరాబాద్:** జగన్ అక్రమాస్తుల కేసు నిందితుడు, పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. వాన్‌పిక్ ఛార్జిషీట్ నిందితుల నుంచి నిమ్మగడ్డ ప్రసాద్‌ను తొలగించేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ మేరకు ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. కేసు నుంచి తొలగించాలని కోరుతూ సీబీఐ కోర్టులో డిశ్చార్జి పిటిషన్ వేసుకోవడానికి అనుమతినిచ్చింది. నిమ్మగడ్డ డిశ్చార్జి పిటిషన్ వేస్తే ఈ తీర్పును పరిగణనలోకి తీసుకోకుండా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని సీబీఐ కోర్టుకు హైకోర్టు సూచించింది.గుంటూరు, ప్రకాశం జిల్లాలో వాన్‌పిక్ ప్రాజెక్టుకు ఉమ్మడి ఏపీలో వైఎస్ఆర్ ప్రభుత్వం సుమారు 13వేల ఎకరాల భూములను కేటాయించింది. వాన్‌పిక్ ప్రాజెక్టు ముసుగులో నిమ్మగడ్డ ప్రసాద్ సుమారు రూ. 1,426 కోట్ల విలువైన భూములను కేవలం రూ.165 కోట్లకే దక్కించుకున్నారని సీబీఐ అభియోగం మోపింది. ప్రతిఫలంగా జగన్‌కు నిమ్మగడ్డ ప్రసాద్ రూ. 854 కోట్లు లంచం ఇచ్చారని ఛార్జిషీట్‌లో వెల్లడించింది. నిమ్మగడ్డ ప్రసాద్‌తో పాటు ఛార్జిషీట్‌లోని నిందితులపై సీబీఐ కోర్టు విచారణ జరుపుతోంది.

అయితే తన పేరు తొలగించాలంటూ నిమ్మగడ్డ ప్రసాద్ వేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఈ కుట్రలో నిమ్మగడ్డ ప్రసాద్‌దే కీలక పాత్ర అని సీబీఐ వాదిస్తోంది.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
మంగళవారం 09 జూలై 2024



**నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన కార్పొరేషన్ చైర్మన్‌లు.**



అన్వేష్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్



కాసుల బాల్‌రాజు, ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్



మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర సహకార సంఘం



ఈరవత్రి అనిల్, మినరల్ డెవలప్‌మెంట్

# రూ" 4000 వేల జీవనభృతి ఇవ్వాలి.

**- ఐఎఫ్టియు ఆధ్వర్యంలో బీడీ కార్మికుల ధర్నా.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 8:**

కార్మికులందరికీ కాంగ్రెస్ మేనిఫెస్టో లో ప్రకటించిన దాని ప్రకారం 4000 వేల రూపాయల జీవన భృతి వెంటనే అమలు చేయాలని ఇఫ్టు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ, బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదనీ, కార్మికులకు ఉపాధి కల్పించండి లేదా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీవనభృతి యిచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత సర్కార్ కెసిఆర్ మనకు అనేక ఆంక్షలు విధించి, కార్మికులకు తీవ్ర ఇబ్బంది కలిగించిందని ఆయన తెలిపారు. భీడీ పరిశ్రమను దెబ్బతీయానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం రకరకాల చర్యలను
చేపట్టి, సిగరేటు కంపెనీలకు ఊడిగం చేస్తుందని ఆయన అన్నారు. మోడీ ఎన్నికల్లో ఉపాధి భద్రత, స్వదేశీ పరిశ్రమల పరిరక్షణ, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు ఇస్తామని



వాగ్దానాలు చేసి, కార్మిక వ్యతిరేక విధానాలతో కార్పొరేట్ కంపెనీలకు సేవ చేసిందని ఆరోపించారు.
కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చి కార్మిక హక్కులను కాల రాస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తెలంగాణ అసెంబ్లీలో నాలుగు లేబర్ కోడలను అమలు చేయడం సాధ్యం కాదని తీర్మానం చేయాలని ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పి.ఎఫ్, ఈఎస్ఐ చట్టాలను కార్మికులకు వర్తింప చేయాలని ఆయన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను బహిరంగంగా వేలం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ, ఉపాధి అయిన కాపాడండి లేదా తిండి అయినా పెట్టండని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ మౌలిక సమస్యల పరిష్కారం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు. భీడి పరిశ్రమలో ప్రధానంగా ఉన్న మహిళల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు నగరంలో ర్యాలి నిర్వహించారు. ఈ సభలో బీడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ భూమేశ్వర్, గౌరవాధ్యక్షులు భూమన్న, ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, పాల్గొని ప్రసంగించారు. యూనియన్ జిల్లా నాయకులు శివకుమార్, పద్మ, సుప్రియ, పోశెట్టి, బాలయ్య, పాల్గొన్నారు. అరుణోదయ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సూరీబాబు, అబ్దుల్, కళాకారులు పాల్గొన్నారు.

# వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 8:**



జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ ఆయా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో ఆయా జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లా మొత్తం 17 లక్షల 88 వేల మొక్కలను వనమహోత్సవ కార్యక్రమంలో నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని ఇందుకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చెయ్యాలన్నారు. ప్రతి శాఖ వారు మీకు ఇచ్చిన టార్గెట్ ను తప్పకుండా పూర్తి చేయాలని అన్ని ప్రభుత్వ పాఠశాలలో, గురుకుల హాస్టల్లో మొక్కలు నాటించాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు ఫారెస్ట్, మున్సిపల్, గ్రామీణ అభివృద్ధి శాఖ వారి నర్సరీల నుండి పొడవాటి మొక్కలు ఎంచుకున్న ప్రాంతాలకు తీసుకెళ్లి మొక్కలు నాటాలన్నారు. అలాగే అవెన్యూ ప్లాంటేషన్ సైతం ఆకర్షించే విధంగా పచ్చదనం పరిమళించేలా మొక్కలను ఎంచుకొని నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ చందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోండి.

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 08 :**

వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రభలె అవకాశం ఉన్నందున,సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ కోసం సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ జరిగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ నీటి నిల్వలను తొలగించి పైపులైను లీకేజీలకు మరమ్మతులు చేయించి శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మిగతా అన్ని శాఖలతో సమన్వయం ఏర్పరచాలని, ముఖ్యంగా పంచాయతీరాజ్, రూరల్ వాటర్



సప్లై, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఫిషరీస్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, విద్యాశాఖ డిఆర్డిఏ, మున్సిపల్, పబ్లిక్ రిలేషన్ లాంటి శాఖలతో కోఆర్డినేషన్ కలిగి జిల్లాలో సీజనల్ వ్యాధులు ముఖ్యంగా మలేరియా, డెంగీ, చికన్ గున్యా లాంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, ప్రజలందరికీ విస్తృతంగా గ్రామస్థాయి నుండి అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలో, కళాశాలల్లో అన్నింటిలో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా వసతిగృహాలు, గురుకులాలు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వారానికి రెండుసార్లు సందర్శించి విద్యార్థులందరినీ ఆరోగ్యపరీక్షలు చేసి చికిత్సలు అందించాలని సూచించారు. కీటకజనిత వ్యాధులతో పాటు డయేరియా నివారణకై ధీమాస ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. చిన్నారులు డయేరియాకు గురికాకుండా ఆరు శాఖలతో సమన్వయ పరచుకుని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్ ను ఏర్పాటు చేయాలని, రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ను, సరిపడా మందులను అందుబాటులో ఉంచుకొని ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా సీజనల్ వ్యాధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పి పి టి స్ట్రాటజీ రక్షించుకోవడం , ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, చికిత్స చేయడం వంటివి పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్

అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరందు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, డీఐఓ డాక్టర్ అశోక్, డి ఆర్ డి ఓ సాయాగౌడ్, డిడబ్ల్యుఓ రసూల్ బి, విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా "జగన్నాథ రథయాత్ర"

**- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 8:**



నగరంలో ఇందూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో 7 వ జగన్నాథ రథయాత్ర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త ముఖ్య అతిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ
మాట్లాడుతూ, ఈ యాత్రలో పాలుపంచుకునే మహత్భాగ్యం లభించడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. జగన్నాధుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఇస్కాన్ సంస్థవారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, వచ్చే సంవత్సరం జగన్నాథ రథయాత్ర లోపు ఇందూరులో కూడా ఇస్కాన్ ఆలయం ప్రారంభం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఇందుకుగాను తన వంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందూరు ఇస్కాన్ సిద్ద బలరాంతో పాటు ఇతర ప్రాంతాల నుండి విచ్చేసిన ఇస్కాన్ సంస్థ ప్రభువులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, బీజేపీ నాయకులు, ప్రభాకర్, ఆనంద్, పవన్ ముందడ, కృష్ణ, హరీష్, నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పెంచుకోవాలి

**జియోకాక్స్ టెక్నాలజీస్ సీఈఓ సంజీవ్ శ్రీవాత్సవ.**

**ఓయూలో "క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్" శిక్షణ ప్రారంభం.**

**వేగుచుక్క న్యూస్, ఉస్మానియా**





యూనివర్సిటీ, జులై 8: ఇంజినీరింగ్ విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పెంచుకోవాలని, తద్వారా తమ జీవితాల్లో ఉన్నతస్థాయికి ఎదగడానికి ఉపయోగ పడుతుందని జియోకాక్స్ టెక్నాలజీస్ సీఈఓ సంజీవ్ శ్రీవాత్సవ అన్నారు.ఇంజినీరింగ్ విభాగాల గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం "క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్" అనే అంశంపై ఓయూలోని 'హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఐదు రోజుల ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.ఓయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సహకారంతో జరుగుతున్న ఈ శిక్షణ ఓయూ లోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్ లో జరుగుతోంది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన జియోకాక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ సంజీవ్ శ్రీవాత్సవ మాట్లాడారు. కంపెనీలు పూర్తి స్థాయి ప్యాకేజీలతో విద్యార్థులను సులభంగా రిక్రూట్ చేసుకోవడానికి తగిన బ్రాండింగ్ ను తయారు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం విద్యార్థులు తమ జీవితంలో వివిధ దశలవారీగా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇది వారు తమ జీవితాల్లో ఉన్నతస్థాయికి ఎదగడానికి, మొత్తం సమాజ అభివృద్ధికి ఉపయోగ పడుతుందన్నారు. ఈ లక్ష్యం సాధించడానికి విద్యార్థులు తమనుతాము వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నిరంతరం ఒక్కోమెట్టు పైకి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ శ్రమ వారిని విజయ తీరాలకు చేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిడిసి ఓయూ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.వి. రంజని, హెచ్‌సిడిసి కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ పి.వి
. సుధ, ఈ శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో మొదటిరోజు న్యూమరికల్ ఎబిలిటీ మరియు ఎనలిటికల్ ఎబిలిటీపై జరిగిన సెషన్‌నలో మిస్టర్ హిమాన్షు నిర్వహించారు.

# రామ్ రావ్ మహారాజ్ జయంతి వాల్ పోస్టర్ ఆవిష్కరణ.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జులై 8**

బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం బాల బ్రహ్మచారి శ్రీ సంత్ తపస్వి రామ్ రావ్ మహారాజ్ 89వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 21 ఆదివారం పౌర్ణమి నాడు ఉమ్మడి మెదక్ జిల్లా లోని ప్రతి గిరిజన తండాల భవాని సేవాలాల్ ఆలయల వద్ద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి మరియు ప్రతి తండాలో 5 వేప చెట్లను నాటాలని మాజీ ఎమ్మెల్సీ, బంజారా బేరి వ్యవస్థాపక అధ్యక్షులు రాములు నాయక్ అన్నారు సోమవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్, లక్ పతి నాయక్, గిరిజన సంస్కృతి ఎడిటర్ ధర్మానాయక్ ప్రేమ్ సింగ్ లు పాల్గొన్నారు





# కుల గణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి.

**- మంత్రి సీతక్కకు జాజుల శ్రీనివాస్ గౌడ్ వినతి.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జులై 8:**

తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీ, మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికల నిర్వహించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్కతో బీసీ సంఘాల ప్రతినిధి బృందం సోమవారం భేటీ అయ్యారు. మొదటగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మంత్రి సీతక్కతో మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కొన్ని సర్పంచుల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్న దరిమిల స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర కులగనను చేసి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణనపై రాష్ట్ర క్యాబినెట్లో, అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో నెంబర్ 26 తీసుకొచ్చి 150 కోట్ల బడ్జెట్ ను విడుదల చేసిన దరిమిల ప్రభుత్వం ఆలస్యం చేయకుండా సమగ్ర కులగనను చేపట్టాలని ఆయన కోరారు.
పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, సమగ్ర కులగనను చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, కులగనన ప్రక్రియను ప్రారంభించడానికి త్వరలోనే అన్ని శాఖల మంత్రులు, అధికారులు సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు మంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మనీ మంజరి, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, నాయకులు నరసింహ నాయక్, తారకేశ్వరి, సంధ్య విజయలక్ష్మి, వాణి పాల్గొన్నారు

# డిష్‌వాష్ స్క్రబ్ వాడుతున్నారా..



గిన్నెలు తోమడానికి స్క్రబ్ చాలా అవసరం. నేడు మార్కెట్‌లో అనేక రకాల స్క్రబ్స్ ఉన్నాయి. వీటితో గిన్నెలు క్లీన్ చేస్తే చక్కగా క్లీన్ అవుతాయి. అయితే, స్క్రబ్ వాడడం ఈజీ అయినప్పటికీ సరిగ్గా వాడకపోతే సమస్యలు వస్తాయి. అవేంటో తెలుసుకోండి..

బ్యాక్టీరియా.. స్క్రబ్స్‌ని సరిగ్గా వాడకపోతే బ్యాక్టీరియా పెరుగుతుంది. స్క్రబ్స్‌లో మురికి, నీరు చేరి తడిగా మారి క్రిములు పెరుగుతాయి. వీటిని సరిగ్గా క్లీన్ చేయకుండా మళ్ళీ వాడితే పాత్రల్లో క్రిములు పెరుగుతాయి. దీన్ని వాడకుండా దీనిని త్వరగా మార్చడం మంచిది. కచ్చితంగా వారానికి ఒక్కసారైనా మార్చాలి. ఎక్కువగా వాసన వచ్చినా కూడా వాటిని మార్చడం మంచిది.

స్పాంజ్ సరిగ్గా లేకపోయినా.. స్పాంజ్ మొత్తం పాడైపోయినా బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంది. ఈ కారణంగా పాత్రలను క్లీన్ చేయడానికి జనపనార, నేచురల్‌గా ఉండే వాటిని వాడడం మంచిది. దీనిని వాడేటప్పుడు ఎక్కువగా శ్రమ కూడా అవసరం లేదు. వీటిలో బ్యాక్టీరియా పెరుగుతుంది.

డిష్ వాషింగ్ స్పాంజ్.. ఇతర వస్తువులని డిష్‌వాషింగ్ స్పాంజితో క్లీన్ చేయాలి. అలాగే వాడిన తర్వాత వాటిని వెనిగర్, మరేదైనా కలిపి బాగా కడిగి వాటిని ఎండలో ఆరబెట్టాలి. వీటిలోని తేమ, వ్యాధికారక క్రిములు పెరుగుతాయి. చేపలు, గుడ్లు, మాంసంతో చేసిన వంటల్ని చేసినప్పుడు అలాంటి పాత్రల్ని క్లీన్ చేసేందుకు వేరే స్క్రబ్ వాడాలి.

# స్లింగ్ బ్యాగ్స్ వాడుతున్నారా











ప్రజెంట్ ట్రెండ్ అవుతున్న బ్యాగ్స్‌లో స్లింగ్ బ్యాగ్స్ కూడా ఉన్నాయి. అయితే, వీటిని ఎలా స్టైల్ చేయాలో తెలుసుకోండి. బ్యాగ్స్ అంటే ప్రతి ఒక్క మహిళకి చాలా ఇష్టం. ఈ బ్యాగ్స్‌ని స్టైల్ చేయడానికి కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. వీటిని బయటికి వెళ్ళినప్పుడు తీసుకెళ్తే చాలా కన్వీనియెంట్‌గా ఉంటాయి. అందుకే వీటిని వాడేందుకు చాలా మంది ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు.

స్లింగ్ బ్యాగ్స్.. స్లింగ్ బ్యాగ్స్ మామూలు బ్యాగ్స్ కంటే చిన్న సైజ్‌తో ఉంటాయి. పెద్ద బ్యాగ్స్ బదులు బయటికి చిన్నవి తీసుకెళ్ళడం చాలా ఈజీగా ఉంటాయి. ఇంతకుముందు కాలంలో ఎక్కువగా ఆడవారే వాడేవాళ్ళు. ఇప్పుడు మగవారు కూడా వాడుతున్నారు.

ఎలా వాడాలి.. ఇందులో మనం ఫోన్స్, డబ్బులు, ఇయర్ ఫోన్స్, బ్లూ టూత్ ఇలా అవసరమైనవన్నీ కూడా పెట్టుకోవచ్చు. ఇవి చాలా కలర్స్, అనేక మోడల్స్‌లో దొరుకుతాయి. ఎక్కువ బరువుగా ఉన్న వస్తువులు పెట్టొద్దు. ఇలా చేస్తే బ్యాగ్స్ కూడా తెగిపోతాయి. కాబట్టి, అవసరమైన వస్తువులే వాడాలి.

ఇవి వద్దు.. ఈ బ్యాగ్స్‌లో ఎక్కువగా ఆయిల్, ఆయిలీ ఐటెమ్స్ వాడొద్దు. వీటిని వల్ల ఆ బ్యాగ్స్ పాడై పోయి స్మెల్ కూడా వస్తాయి. కాబట్టి, ఇవి పెట్టకపోవడమే మంచిది. కూరలు, ఫుడ్ ఐటెమ్స్ స్లింగ్ బ్యాగ్స్‌లో పెట్టకపోవడమే మంచిది.

అదే విధంగా, వీటిని వాడక చక్కగా క్లీన్ చేయాలి. అవి ఆరిన తర్వాతే బీరువాలో పెట్టడం మంచిది. అప్పుడే అవి ఎక్కువ రోజులు మన్నుతాయి. ఈ బ్యాగ్స్ చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. ఇందులో ఉన్న డిస్ అడ్వాంటేజెస్ ఏంటంటే, ఈ బ్యాగ్ మొత్తం బరువు భుజంపైనే ఉండడం వల్ల భుజం, వెన్నునొప్పి వంటి సమస్యలొస్తాయి. కాబట్టి, ఎక్కువ సమయం వీటిని వీటిని వాడొద్దు. బరువు పెరిగితే బాడీ షేప్‌తో పాటు భుజం నొప్పి కూడా వస్తుంది. కాబట్టి, వీటిని అప్పుడప్పుడు మాత్రమే వాడాలి.

# ల్యాప్‌టాప్ ఒడిలో పెట్టుకుని వాడుతున్నారా..



కొందరు ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకుని వాడుతుంటారు. అయితే, ఈ అలవాటు కారణంగా ఆరోగ్యంపై దుష్ప్రభావాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ జనరేషన్‌లో ల్యాప్‌టాప్ అత్యవసర టూల్‌గా మారింది. ఆఫీస్ వర్క్, ఆన్‌లైన్ క్లాసులు, గేమింగ్, వీడియోలు చూడటానికి ఇలా చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకూ.. లాప్‌టాప్ వాడేస్తున్నారు. లాప్‌టాప్‌లు పోర్టబుల్‌గా, వాడుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటాయి. బెడ్‌పైన హాయిగా కూర్చునో, టేబుల్ లేకనో.. ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకుని వాడుతుంటారు కొందరు. అయితే, లాప్‌టాప్‌ను డైరెక్ట్‌గా శరీరానికి తాకించి వాడితే.. అనేక దుష్ప్రభావాలు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ల్యాప్‌టాప్ అనేక ఫ్రీక్వెన్సీలలో లను విడుదల చేస్తుంది. ఈ ఆరోగ్యానికి చాలా హానికరం. మీరు కూడా.. ల్యాప్‌టాప్ ఒడిలో పెట్టుకుని పనిచేసుకుంటుంటే..

పునరుత్పత్తి అవయవాలకు హానిచేస్తాయి..లాప్‌టాప్ ఒడిలో పెట్టుకుని పనిచేసుకోవడం.. కంఫర్ట్‌గా అనిపించినా, ఈ అలవాటు పునరుత్పత్తి వ్యవస్థకు హాని చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లాప్‌టాప్ వైర్‌లెస్ ఇంటర్నెట్ సిగ్నల్‌లను (మైక్రోవేవ్‌లు) అందుకుంటుంది, అనేక ఫ్రీక్వెన్సీలలో లను విడుదల చేస్తుంది. కాళ్లపై పెట్టుకుని ల్యాప్‌టాప్ వాడితే.. మగవారిలో స్పెర్మ్ కౌంట్‌పై ప్రభావం పడుతుంది, మహిళలలో ఎగ్ రిలీజ్ సమక్రమంగా జరగదు. ల్యాప్‌టాప్ కాళ్లపై పెట్టుకుని వాడితే.. వృషణాల దగ్గర, స్పెర్మ్ కణాల దెబ్బతింటుందని అర్జెంటీనాలో నిర్వహించిన ఓ అధ్యయనం స్పష్టం చేసింది. ఇది పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యంపై దుష్ప్రభావం చూపుతుంది. ఈ అలవాటు.. సంతానోత్పత్తిని ప్రభావితం చేస్తుంది.. అమెరికన్ సొసైటీ ఫర్ రిప్రొడక్టివ్ మెడిసిన్ నిర్వహించిన ఒక అధ్యయనం పేర్కొంది.

కొన్ని క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది.. ల్యాప్‌టాప్‌ను కాళ్లపై పెట్టుకుని వాడితే.. దాని నుంచి ఉత్పత్తి అయ్యే వేడి కారణంగా చర్మం దెబ్బతింటుందని, ఇది స్కిన్ క్యాన్సర్ ముప్పును పెంచుతుందని యూనివర్శిటీ హాస్పిటల్ బాసెల్‌కు చెందిన స్విస్ పరిశోధకులు, ఆంద్రియాస్ ఆర్నాల్డ్, ఆంద్రియాస్ ఆర్నాల్డ్ తెలిపారు. పునరుత్పత్తి అవయవాలకు దగ్గరగా ల్యాప్‌టాప్ పెట్టుకుంటే.. వృషణ, అండాశయ క్యాన్సర్ల ముప్పును పెంచుతుంది. వెన్నునొప్పి, మెడ నొప్పికి కారణం అవుతుంది..

వెన్నునొప్పి, మెడ నొప్పికి కారణం అవుతుంది.. ల్యాప్‌టాప్‌ను ఒడిలో ఉంచుకుని పనిచేస్తే.. మెడ, వీపు భాగంలో నొప్పికి కారణం అవుతుందని ఓ తాజా అధ్యయనం స్పష్టం చేసింది. ఇది వ్యక్తి భంగిమను దెబ్బతీస్తుంది. దీని కారణంగా మెడ, వెన్నునొప్పి వస్తాయి. ల్యాప్‌టాప్‌ను డైరెక్ట్‌గా కాళ్లపై పెట్టుకుంటే.. చర్మాన్ని ప్రభావితం చేస్తుందని నిపుణులు అంటున్నారు. దీర్ఘకాలం పాటు ఈ అలవాటు కొనసాగితే.. "ఎరిథీమా అబ్ ఇగ్నే" అనే సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. ఇది చర్మం రంగును మారుస్తుంది. ముఖ్యంగా వైఫై కనెక్ట్ అయినప్పుడు.. ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకుంటే, ఈ ముప్పు ఇంకా ఎక్కువ అవుతుంది.

# చెప్పులు, షూ కొనేటప్పుడు ఈ టిప్స్ ఫాలో అవ్వండి..





చెప్పులు కొనేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. ఎందుకంటే రోజువారీ జీవితంలో చెప్పులు కీ రోల్ పోషిస్తాయి. మీరు చెప్పులను ఎన్నుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే ఆర్థరైటిస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మరి ఆ టిప్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

కంఫర్ట్.. మీరు చెప్పులు కొనేటప్పుడు కొన్ని ముఖ్య విషయం ఏంటంటే, మీ పాదాలకు మంచిగా అనిపించే వాటిని కొనాలి. ఏదైనా ఈవెంట్ కోసం సౌకర్యవంతంగా ఉండే చెప్పులు తీసుకోండి. మీ పాదాలకి సరిగ్గా ఫిట్‌గా ఉన్నాయో లేదో చూడండి. దీని వల్ల నడిచినప్పుడు నొప్పి ఉండదు. మీ సైజ్ ప్రకారం చెప్పులు తీసుకోవాలి.

క్వాలిటీ.. అదే విధంగా, చెప్పులు క్వాలిటీ కూడా చూడడం చాలా ముఖ్యం. స్టైల్‌తో పాటు మనం పెట్టే డబ్బుకి సరిపడా క్వాలిటీ ఉందా. ఇది కొన్ని రోజుల వరకూ సరిగ్గా ఉంటాయా అనేది తెలుసుకోండి.

లైఫ్‌స్టైల్.. చెప్పులు లైఫ్‌స్టైల్‌కి కూడా దగ్గర సంబంధం ఉంది. ఎక్కువసేపు నిలబడడం, వాకింగ్ చేసేవారు, బయటకు వెళ్ళడం వంటి సందర్భాన్ని బట్టి వాటిని కొనాలి. ఎందుకంటే, ప్రతి పనికి ఒకే చెప్పులని వేసుకెళ్ళలేం.

మీకు నచ్చేవి.. అదే విధంగా వీటిని కొనేటప్పుడు మీ ఇష్టాలు కూడా చూసుకోవడం ముఖ్యం. మీ ఫ్యాషన్‌ని చెప్పకనే చెప్పేలా ఉండాలి. ఇష్టమైన రంగులు, డిజైన్స్‌ని ఎంచుకోండి. మీకు సరిపోయే వాటిని ఎంచుకోండి.





మ్యాచింగ్.. అదే విధంగా, మీరు మ్యాచింగ్ అయ్యే విధంగా తీసుకోండి. వైట్, బ్లాక్, క్రీమ్ వంటి కల్స్ తీసుకోవచ్చు. వీటిని తీసుకుంటే ఏ డ్రెస్‌కైనా మ్యాచ్ అయిపోతుంది. కాబట్టి, అలాంటి వాటిని తీసుకోండి.

# ఇలాంటి సిలిండర్స్‌ని అస్సలు వాడొద్దు..









గ్యాస్ సిలిండర్స్ లేని ఇంటిని ఊహించలేం. ప్రతి ఒక్కరూ వీటిని వాడుతుంటారు. అయితే, దీని వల్ల ఇంట్లో ఉపయోగాలు ఉన్నాయో.. సరైన విధంగా వాడకపోతే అన్ని సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి, వాటన్నింటిని నిర్లక్ష్యం చేయకుండా చక్కగా వీటిని వాడాలంటి కొన్ని తెలుసుకోవాలి. అవేంటో తెలుసుకోండి.


మెయింటనెన్స్.. అదే విధంగా, చాలా మంది ఇళ్ళల్లో సిలిండర్స్ ఎంత పాతగా అయినా, తుప్పు పట్టినా వాటినే వాడుతుంటారు. అలా ఎప్పుడు చేయకండి. మరీ పాడైన సిలిండర్‌ని ఇస్తే వాటిని తీసుకోకపోవడమే మంచిది. అదే విధం గా సిలిండర్‌పై డేట్ ఉంటుంది. దానిని చూసి తీసు కుని వాడడం మంచిది. ఏదైనా ఉంటే గ్యాస్ డిస్ట్రిబ్యూ టర్‌తో మాట్లాడి ప్రాబ్లమ్‌ని సాల్వ్ చేసుకోవడం మంచిది.

దగ్గర వద్దు.. అదే విధంగా ఈ ఎలక్ట్రిక్ ప్లగ్స్, సాకెట్స్, టీవీ కనెక్షన్స్, వేడి వాతావరణంలో ఈ సిలిండర్స్ అస్సలు పెట్టొద్దు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇవి మరింత తీవ్రతని పెంచుతాయి. కాబట్టి, వీటన్నింటికి దూరంగా ఉంచడం మంచిది.


వెంటిలేషన్.. గ్యాస్ సిలిండర్‌ని మూసి ఉన్న రూమ్‌ల్లో ఉంచకుండా ఎక్కువగా వెంటిలేషన్ ఉన్న ప్లేస్‌ల్లో ఉంచండి. ఎందుకంటే, గ్యాస్ లీక్ అయినా త్వరగా దాని ప్రభావం వెళ్ళిపోతుంది. కాబట్టి, ఎక్కువగా గాలి, వెలుతురు వచ్చే ప్లేసులో పెట్టడం మంచిది. ఇరుకుగా ఉన్న ప్లేసులో పెట్టడం అస్సలు మంచిది కాదు.

లీకేజీ అయితే.. అదే విధంగా, గ్యాస్ లీకేజ్ అవుతున్నట్లుగా గమనిస్తే సిలిండర్‌కి కాస్తా దూరంలో సబ్బు నీటిని పెడితే నురగ నుంచి బుడగలు వస్తే సమస్య ఉందని అర్థం. ఇలాంటి టైమ్‌లో భయపడకుండా లైటర్స్, అగ్గిపుల్లలు అస్సలు వాడొద్దు. త్వరగా కిటికీలు, తలుపు తీయండి. దీనిని బహిరంగ ప్రదేశంలో పెట్టి డిస్ట్రిబ్యూటర్స్‌కి ఇన్‌ఫామ్ చేయండి.

# ఈ ఆసనాలు చేస్తే మోకాళ్ళ నొప్పులు తగ్గుతాయుట..







మోకాళ్ళు శరీరంలో ముఖ్య భాగం. వయసు పెరిగేకొద్దీ ఇవి బలహీనమవుతాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని యోగాసననాలు హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి.

నడవడం, పరుగెత్తడం, గెంతడం వంటివి చేయాలంటే మన మోకాళ్ళు బలంగా ఉండాలి. కానీ, నేటికాలంలో చాలా మంది మోకాళ్ళ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కీళ్ళనొప్పులతో బాధపడుతున్నారు. అలా కాకుండా ఉండాలంటే కాళ్ళ కండరాలను బలంగా చేసే ఆసనాలు చేయడం ముఖ్యం. అలాంటి ఆసనాలు ఏంటో తెలుసుకుందాం.

ముందుగా మ్యాట్‌పై నిలబడండి. ఇప్పుడు ఎడమ కాలుని రెండు అడుగుల ముందుకు ఉంచండి. ఊపిరి పీల్చుకుంటూ రెండు చేతులని పైకి ఉంచండి. అలానే ముందు కాలుని మడిచి, రెండు చేతులని పైకి లేపాలి. వెన్నెముకని బాగా వెనక్కి ఉంచాలి. మెల్లిగా శ్వాస పీల్చుకోవాలి. మరో కాలుతో కూడా ఈ ఆసనం చేయండి.

మోకాలి నొప్పులు ఎందుకొస్తాయి..

ఉపవిష్టకోనాసనం.. ముందుగా చాప మీద కాళ్ళు చాచి కూర్చోవాలి. తర్వాత కాళ్ళని పక్కకి చాపి పెట్టాలి. కాలివేళ్ళు పైకి చూస్తుండాలి. ఊపిరి పీల్చుకుంటూ అరచేతులని ముందుకు చాచాలి. ముందుకు వంగుతూ చేతులని పాదాల వైపుకి చాచండి. ముందుకు వంగి కాలి బొటనవేలు నేలపై మీ నుదటితో పట్టుకోండి. 20 సెకన్ల పాటు అదే స్థితి ఉండి డీప్ బ్రీథ్ తీసుకుని కాలి బొటనవేలు వదిలి చేతులు నేలపై ఉంచాలి. రెండు పాదాలను కలిపి చాప మీద నిలబడండి. రెండు చేతులని కలిపి పైకి లేపండి. నెమ్మదిగా బ్రీథ్ తీసుకుంటూ నడుముని కిందకి వంచండి. ఇలా వంచినప్పుడు నడుము మాత్రమే వంచాలి. మోకాళ్ళని కాదు. ఇదే స్థితిలో కాసేపు ఉండి నెమ్మదిగా పైకి లేవండి. దీనినే 10 సార్లు రిపీట్ చేయండి.

ఆంజనేయాసనం.. రెండు పాదాలు కాస్తా దూరంగా చాప మీద నేరుగా ఉంచండి. తర్వాత కుడి కాలు మోకాలి నుండి పాదం వరకూ నేలను తాకేలా వెనక్కి చాచాలి.రెండు అరచేతులు ఒకదానికొకటి ఎదురుగా ఉండేలా చేతులని పైకి లేపాలి నిటారుగా ముందుకు చూస్తూ పొత్తికడుపు మాత్రమే ముందుకు ఉంచి వెనక్కి వంచి తల, చేతులని వెనక్కి వంచాలి. 20 సెకన్ల పాటు అదే స్థితిలో ఉండి యథాస్థానానికి తిరిగి రావాలి. మళ్ళీ రిపీట్ చేయండి.

# ఉసిరికాయ చిప్స్.. ఎంతో టేస్టీ.. మరెంతో హెల్దీ..



ఉసిరికాయలు ఆరోగ్యానికి ఆరోగ్యానికి చాలా మంచిదని చెబుతుంటారు. వీటిని చిప్స్‌లా చేసుకుని తింటే ఎంతో టేస్టీ అంటారు.. అదెలానో తెలుసుకోండి.. ఉసిరికాయ సంవత్సరమంతా దొరకదు కదా. అందుకే, ఇక్కడ ఈ సూపర్ ఫుడ్ ని ఏడాది అంతా నిలవ ఉండేలా ఏం చేయాలో ఉంది, చూడండి. ఈ పద్ధతే సాల్టీ ఆమ్లా చిప్స్ – ఎండబెట్టిన ఉసిరికాయ స్లైసులు. వీటిని భోజనం తరువాత మౌత్ ఫ్రెషనర్ గా కూడా వాడుకోవచ్చు. వీటిని ఎలా తయారు చేయాలో ఇప్పుడు చూసేద్దాం.

ఉసిరికాయ – ఒక కేజీ, రెడ్ చిల్లీ పౌడర్ – నాలుగైదు టీ స్పూన్లు ( మీకు అవసరం లేదనుకుంటే ఎవాయిడ్ చేయవచ్చు) బ్లాక్ సాల్ట్ – రుచికి తగినంత... 1. ఉసిరికాయలని బాగా కడిగి పొడిగా తుడవండి.

2. అందులో నుండి గింజలు తీసేసి చిన్న చిన్న స్లైసులుగా కట్ చేయండి. 3. బ్లాక్ సాల్ట్, రెడ్ చిల్లీ పౌడర్ కలిపి ఉసిరికాయ స్లైసులకి బాగా పట్టేలా కలపండి. 4. వీటిని మైక్రో వేవ్ ఒవెన్ సేఫ్ ప్లేట్ లో ఉంచి నాలుగైదు నిమిషాలు మైక్రో వేవ్ చేయండి. లేదా, ఒక పెద్ద పళ్ళెం లో వీటిని పరిచి సుమారుగా ఒక వారం రోజులు, లేదా ఉసిరికాయ ముక్కలు క్రిస్పీగా డ్రైగా అయ్యేవరకూ ఎండబెట్టండి. 5. ఇప్పుడు వీటిని ఒక గాలి చొరని డబ్బాలో నిలవ ఉంచుకోండి. ఈ డబ్బాని చల్లగా పొడిగా ఉండే ప్రదేశం లో ఉంచండి. ఫ్రిజ్ లో మాత్రం కాదు. సంవత్సరం పొడవునా వీటి హెల్త్ బెనిఫిట్స్ ఎంజాయ్ చేయండి. వీటిని ఇంట్లో తయారు చేసుకుని రోజూ హెల్దీ న్యూట్రియెంట్స్ ని తీసుకోండి.

ఆరోగ్యం గురించి ఎప్పుడు మాట్లాడుకున్నా ఉసిరికాయ గురించి కూడా మాట్లాడుకోవాలి. ఇందులో ఉన్న పోషకాల వల్ల ఉసిరి కాయని ట్రెడిషనల్ మెడిసిన్ లో ఎక్కువగా వాడుతూ ఉంటారు. నిజానికి, ఇంట్లో పెద్దవాళ్ళు జీర్ణ క్రియ బాగుండడానికి ఉసిరికాయని మించింది లేదని చెబుతారు. బలమైన రోగ నిరోధక వ్యవస్థ, హెల్దీ మెటబాలిజం, మంచి జీర్ణ శక్తి, చర్మ సౌందర్యం, హెల్దీ హెయిర్ వంటి ఎన్నో బెనిఫిట్స్ ఈ లేత ఆకుపచ్చ పండుకి ఉన్నాయి. ఇందులో విటమిన్స్ ఏ, సీ, ఈ, ఫ్లేవనాల్స్, యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మరియు యాంటీ వైరల్ ప్రాపర్టీస్ ఉన్నాయి. అంతే కాక, వంద గ్రాముల ఉసిరికాయ లో ఇరవై కమలా పండ్ల లో ఉండేంత విటమిన్ సీ ఉంటుందని చెబుతారు. ఎలాంటి బాడీ టైప్ కైనా, ఏ సీజన్ లో అయినా రెగ్యులర్ గా ఉసిరికాయ తీసుకోవాలని శుశ్రుతుడు అన్నట్లుగా చెబుతారు. అందుకే, పోషకాహార నిపుణులు రోజులో కనీసం ఒక ఉసిరికాయ అయినా తీసుకోవాలని చెబుతారు.

ప్రస్తుతం ఉన్న కరోనా వైరస్ నేపథ్యం లో ఉసిరికాయ తీసుకోవడాన్ని ముఖ్యావసరం గా చెప్పుకోవచ్చు. ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్, సివియారిటీని తగ్గించడానికి బలమైన ఇమ్యూనిటీ కావాలని ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు చెబుతున్నారు. స్ట్రాంగ్ ఇమ్యూనిటీకి కావాల్సిన విటమిన్ సీ ఉసిరికాయ లో పుష్కలం గా ఉంది. ఒక నాచురల్ యాంటీ ఆక్సిడెంట్ గా విటమిన్ సీ మనని ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుండి ప్రొటెక్ట్ చేస్తుంది. ఇమ్యూనిటీని పెంచి వివిధ రకాల వ్యాధుల నుండి కాపాడుతుంది. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.